

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


# నెత్తురోడిన ఔటర్ రింగ్ రోడ్డు





ఔటర్ రింగురోడ్డు వద్ద ఇద్దరిని బలితీసుకున్న లారీ

## శామీర్‌పేట ఔటర్ రింగురోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

### కారు ఆపి వెనుక కూర్చుని భోజనం చేస్తుండగా దూసుకొచ్చిన లారీ

### అక్కడికక్కడే ఇద్దరు మృతి

**శామీర్‌పేట, మార్చి 16, ప్రభాతవార్త :** శామీర్‌పేట ఔటర్ రింగురోడ్డున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. ఓఆర్ఆర్‌పై కారులో వెళుతూ.. మధ్యలో ఆపి కింద కూర్చుని భోజనం చేస్తున్న ఇద్దరిని మాయదారి మృత్యుశకటం బలితీసుకుంది. వివరాలలోకి వెళితే.. పోలీసుల కథనం ప్రకారం నగరంలోని మౌలాలి ఆర్టీసి కాలనీకి చెందిన మమ్మద్ యూసుఫ్‌ఖాన్ (51), నగరంలోని షేక్‌పేట్‌కు చెందిన మమ్మద్ హుస్సెన్ (48) సోమవారం ఆడి కారులో ఇసిఐఎల్ నుంచి తూప్రాన్ వైపునకు ఓఆర్ఆర్ మార్గం ద్వారా ప్రయాణిస్తున్నారు. మార్గమధ్యంలో శామీర్‌పేట ఓఆర్ఆర్ లిమిట్స్‌కు చేరుకున్నాక కారును పక్కకు ఆపి.. వెనకాల కూర్చుని భోజనం చేస్తున్నారు. కీసర వైపున నుంచి అతివేగంగా అశోక్ లేలాండ్ లారీ వేగంగా వచ్చి వారి పైకి దూసుకెళ్లింది. ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను గాంధీ ఆసుపత్రి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మద్యం సేవించి ఉండటం వలనే ప్రమాదానికి కారణమైందని తెలిపారు. పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపసర్పంచ్ అంజయ్య మృతి



**కేశంపేట, మార్చి 16, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామ ఉపసర్పంచ్ అంజయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. టమాట పంట నారు కోసం రాయలసీమలోని పెనుగొండ కు వెళ్లినట్టు గ్రామస్తులు తెలిపారు. ఏం జరిగిందో తెలియదు కానీ రోడ్డు ప్రమాదంలో ఉపసర్పంచ్ అంజయ్య మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అంజయ్య ప్రయాణిస్తున్న వాహనం లారీని ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదం జరిగిందని ఈ ప్రమాదంలో అంజయ్య చనిపోయినట్లు సంతపూర్ గ్రామస్తులు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అందరికీ సుపరిచితుడు అంజయ్య మృతి చెందడంతో సంతాపూర్ గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. అంజయ్య మృతి పట్ల పలువురు ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

## పరిశ్రమల వ్యర్థాలను భరించలేకపోతున్నాం



**శామీర్‌పేట, మార్చి 16, ప్రభాతవార్త :** జగ్గంగూడ, సంపన్‌బోల్ గ్రామాల పరిధిలో ఉన్న హెరి టేజ్ డైరీ కంపెనీ వెనకాల కలుషితనీరు, వ్యర్థపదార్థాలు నిల్వ చేయటం వల్ల పర్యావరణం కలుషితం అవుతోందని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవికి, కమిషనర్ పవన్‌కుమార్‌కు జగ్గంగూడ గ్రామ కౌన్సిలర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, జంగారెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. బోర్లు ఇష్టానుసారంగ వేస్తున్నారని, కట్టడాలు కొనసాగుతున్నాయని బోర్లు వేయటం వల్ల రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు.

# ఆర్‌టిసీ ఛీ...



### సిఎం జిల్లాలో గాడితప్పిన ప్రజా రవాణా వ్యవస్థ

- తాండూరు డిపోలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం
- వేళకు రాని బస్సులతో ప్రయాణీకుల ఇక్కట్లు
- డ్రైవర్, కండక్టర్ల మీదకు నెపం నెట్టేస్తున్న అధికారులు
- ఇక్కడి వచ్చిన రెండు కొత్త బస్సులు ఇతర డిపోలకు తరలింపు?
- హైదరాబాద్ శివారులో నడిచిన పాత బస్సులతో భర్తీ
- ఫ్లాట్‌ఫారాలపై చెత్తాచెదారం
- ప్రాంగణంలో పందుల స్వైర విహారం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కొంతకాలంగా ఆర్టీసీ అధికారుల ఉదాసీనత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రంగారెడ్డి రీజియన్ పరిధిలోని వికారాబాద్ జిల్లాలో బస్సులు వేళకు నడపడం లేదని ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి డిపోలు ఉన్నాయి. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గి డిపో నారాయణపేట జిల్లా పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం ఉన్న మూడు డిపోలలో తాండూరు డిపోలోనే ఎక్కువగా నిర్లక్ష్యం కనిపిస్తోందని విమర్శలు వస్తున్నాయి. కార్మికులకు, అధికారులకు మధ్య సమన్వయం కొరవడం వల్ల సకాలంలో బస్సులు బయలుదేరడం లేదని తెలుస్తున్నది. ఉదయం పూట హైదరాబాద్ రూట్లో నడిచే బస్సులు అర గంట ఆలస్యంగా ఉంటున్నాయని వాపోతున్నారు. ఇదే విషయమై అధికారులను అడగాలంటే సరైన సమాధానాలు ఇవ్వడం లేదని అంటున్నారు. తాండూరు డిపో నుంచి ఉదయం 4.30 గంటల నుంచి హైదరాబాద్ రూట్లో బస్సులు ప్రారంభమవుతాయి. చేవెళ్ల వద్ద బస్సు ప్రమాదం తర్వాత మరీ ఉదాసీనత కనిపిస్తోందని మండిపడుతున్నారు. ప్రయాణికుల రద్దీ పెరగడం వల్ల బస్‌స్టేషన్ వద్ద ఫ్లాట్‌ఫారాలపై కాకుండా నేరుగా డిపో వద్దకు వచ్చి బస్సులు ఎక్కుతున్నారు. 5 గంటల నుంచి 6 గంటల మధ్య బస్సు రాలేదని అధికారులను ప్రశ్నించగా డ్రైవర్, కండక్టర్లు ఇంకా రాలేదనే సమాధానాలు ఇస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు.

**వెనక్కి వెళ్లిన కొత్త బస్సులు**

యేడాదిన్నర క్రితం తాండూరు డిపోకు వచ్చిన రెండు కొత్త బస్సులు ఇటీవల ఇతర డిపోలకు తరలించినట్లు సమాచారం. టీజీ 34 జడ్ 0030, టీజీ 34 జడ్ 0031 పల్లెవెలుగు బస్సులను గద్వాల డిపోకు తరలించినట్లు తెలిసింది. ఇవే కాకుండా నాలుగు నెలల క్రితమే రెండు డిలక్స్ బస్సులను కూడా ఇతర డిపోలకు పంపించినట్లు సమాచారం. వాటి స్థానంలో హైదరాబాద్ నగర శివారులో నడిచిన పాత బస్సులను తాండూరు డిపోకు పంపిస్తున్నారని కార్మిక వర్గాల సమాచారం. ఇది అధికారుల ఉదాసీనతకు పరాకాష్టగా మారిందని విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు తెలియకుండా డిపో అధికారులు జాగ్రత్త పడుతున్నారు, సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో రవాణా వ్యవస్థ దుర్భరంగా మారితే ఎవరికి చెప్పుకోవాలని ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**డ్యూటీ సరిగ్గా ఇవ్వకుంటే చస్తా..**

తాండూరు డిపోలో పని చేస్తున్న సిబ్బందికి ఉండే 'కీ' ప్రకారం డ్యూటీలు వేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్ రూట్లో వెళ్లే వారిని మారుమూల ప్రాంతాలకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకున్న డ్యూటీలను సక్రమంగా ఇవ్వడం లేదని పలువురు మహిళా కండక్టర్లు డిపో అధికారులను నిలదీస్తున్నారు. ఇటీవల ఓ మహిళా కండక్టర్ అధికారుల తీరుపై తీవ్ర మనోవేదనకు గురైనారు. కీ ప్రకారం డ్యూటీ ఇవ్వకుంటే తనకు ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆర్టీసీ గ్రూప్‌లో వాయిస్ రికార్డు పెట్టడం కలకలం సృష్టించింది.

**అపరిశుభ్రంగా బస్‌స్టేషన్**



తాండూరు బస్‌స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నిరంతరం చెత్త ఊడ్చడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఫ్లాట్‌ఫారాలపై చెత్తాచెదారం పడి ప్రయా ణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తు న్నాయి. పర్యవేక్షణాధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఆవరణలో ఉన్న డ్రైన్లు కూడా శుభ్రం చేయడం లేదు. బస్సుల సీట్లు కూడా మురికిగా ఉంటున్నాయని పెదవి విరుస్తున్నారు. రాత్రిపూట బస్‌స్టేషన్ ఆవరణలో లైట్లు వెలగడం లేదు. చీకట్లో బస్సుల కోసం ఎదురు చూస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధ్వాన్నంగా మారిన తాండూరు డిపోపై ఉన్నతాధికారులు ఫోకస్ పెట్టాలని అంటున్నారు.



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

## నెల జీతం రూ.18వేలు ఇవ్వండి

### ఆశా వర్కర్ల డిమాండ్ - కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష ప్రారంభం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 16, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ ముందు ఆశావర్కర్లు 48గంటల నిరసన దీక్షకు దిగారు. ఆశావర్కర్లకు నెలకు 18 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఆశవర్కర్ల నిరసన దీక్ష కార్య క్రమంలో సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగుతుంది. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు కార్యదర్శి ఎర్ర అశోక్ మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు నెలకు 18వేల రూపాయల వేతనం నిర్ణయించాలని, సమస్యలను పరిష్కరించాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఐద్వా మేడ్చల్ జిల్లా కార్యదర్శి వినోదతో పాటు ఐద్వా కమిటీ సభ్యులకు సంఘీభావం తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఆశావర్కర్ల అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి రేవతి, వర్కింగ్ ప్రసిడెంట్ ఉన్నికృష్ణన్, తదితరులు పాల్గొన్నారు. దీంతో కలెక్టరేట్ వద్ద శామీర్‌పేట పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

# ప్రజా సమస్యలపై నజర్

- తొలి కౌన్సిల్ సమావేశంలోనే అధికారులకు కీలక ఆదేశాలు
- వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి రాకూడదని స్పష్టీకరణ
- ప్రజలకు అందుబాటులో ఉండాలంటూ చైర్మన్ చురకలు

**శామీర్‌పేట, మార్చి 16, ప్రభాతవార్త :** రానున్న వేసవితో గ్రామాల్లో (వార్డుల్లో) నీటి ఎద్దడి లేకుండా చూడాలని, డ్రైయినేజీ, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి సూచించారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ తొలి కౌన్సిల్ సమావేశం చైర్మన్ జామ్ రవి అధ్యక్షతన జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశంలో ప్రధానంగ త్రాగునీరు, నీటి సరఫరా, మురికికాలువల సమస్య, విద్యుత్ దీపాల సౌకర్యం, పారిశుద్ధ్యం నిర్వాహణ పలు అంశాలపై సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ జామ్ రవి మాట్లాడుతూ మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే అధికారులు స్పందించి పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరు కూడ సహకరించాలని, అందరు కలిసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని చైర్మన్ జామ్ రవి సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని, అదే విధంగా అభివృద్ధి పనులు కూడా చురుకుగా సాగేలా కృషి చేయాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని వార్డుల ప్రజాప్రతినిధుల (కౌన్సిలర్ల) సహకారంతో ముందుకు వెళ్లాలని, వార్డులో కార్యక్రమాలు ఉంటే అధికారులు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కౌన్సిల్ సమావేశంలో వైస్‌చైర్మన్ ఎం.శశిరేఖ, కమిషనర్ పవన్‌కుమార్, కౌన్సిలర్లు ఆర్.నీరజ్‌గౌడ్, ఎం.నవీన్‌నాయక్, ఎం.పాపిరెడ్డి, వి.ప్రియాంకరెడ్డి, చిన్నలచ్చ సరిత, జి.రమేశ్, జి.జ్యోతి, ఎం.గోవర్ధన్‌రెడ్డి, పెద్దిరెడ్డి శ్రీలత, దోసకాయల లత, ఆర్.లత, పులి ప్రభాకర్, ఆది అజయ్‌కుమార్, కొంపల్లి మాదవి, ఎం.మౌనిక, కొలాస్ రాజు, చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, గూడ జంగారెడ్డి, గొంది శ్రావణి, బొమ్మలపల్లి మల్లేశ్, గుండ్లపల్లి మహేశ్వరి, ఇర్రి స్వప్న, మేనేజర్ ఉషా, ఆర్ఓ హర్షద్, ఆర్ఐలు రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, డిఇ స్ఫూర్తి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

## ప్రతి దరఖాస్తుపైనా ప్రత్యేక శ్రద్ధ

**వికారాబాద్, ప్రభాతవార్త :** ప్రజావాణిలో స్వీకరించిన పెండింగ్ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజావాణి లో 119 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖా స్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్క రించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా మున్సిపాలిటీలు, పంచా యతీ రాజ్, అటవీ శాఖ, డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, జడ్పీ సీఈఓ సుధీర్, ఆర్డీఓ వాసు చంద్ర తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నేతలు

## ప్రోత్సహించాల్సింది పోయి.. భారాలు మోపుతారా?

### రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నేతల ఆందోళన

### పెనాల్టీ, వడ్డీ మాఫీ చేయాలని డిమాండ్

**రంగారెడ్డి అర్బన్, మార్చి 16, ప్రభాతవార్త:** రైస్ మిల్లరు 2022-23 రబీ సీజన్‌లో 100 శాతం బియ్యం డెలివరీ చేసినప్పటికీ రైస్ మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీతో పాటు 12 శాతం వడ్డీని వెంటనే మాఫీ చేసి మిల్లర్లకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ చెర్కు యాదయ్య మాట్లాడుతూ, 2022-23 రబీ సీజన్‌లో ప్రభుత్వము రంగారెడ్డి జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయించి మిల్లింగ్ చేయించిందని తెలిపారు. అయితే ఆ ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని స్వీకరించేందుకు స్పష్టమైన ఆర్డర్లు గానీ, టెండర్ ప్రక్రియ ద్వారా గానీ ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ జిల్లాలోని మిల్లర్లు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తూ 100 శాతం బియ్యం డెలివరీ పూర్తి చేశారని చెప్పారు. అయితే డెలివరీ పూర్తి చేసిన తర్వాత కూడా మిల్లర్లపై 25 శాతం పెనాల్టీతో పాటు 12 శాతం వడ్డీ విధించడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల జిల్లాలోని అనేక రైస్ మిల్లర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించిన మిల్లర్లను ప్రోత్సహించాల్సింది పోయి ఇలాంటి భారాలు మోపడం సరైంది కాదని అన్నారు. కాబట్టి 2022-23 సీజన్‌కు సంబంధించి విధించిన 25 శాతం పెనాల్టీ మరియు 12 శాతం వడ్డీని వెంటనే మాఫీ చేయాలని చెర్కు యాదయ్య కోరారు. అంతేకాకుండా 2025-26 రబీ సీజన్‌లో ఆయా మిల్లులకు తిరిగి ధాన్యం కేటాయిస్తూ, గత కొన్ని సంవత్సరాలుగా బకాయి ఉన్న మిల్లింగ్ చార్జీలు, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, డ్రెయినేజ్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తొలిసారిగా డిజిటల్ విధానంలో జనగణన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** జన గణన 2027 పథకాల అమలు, దేశ అభివృద్ధికి మూలమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జన గణన-2027 నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు 3 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జన గణన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమంలో పూర్తి అవగాహన కలిగిస్తుందని అన్నారు. జిల్లా స్థాయి లో జన గణన 2027 సమర్థమంతంగా నిర్వ హించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిం చాలన్నారు. జన గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహాల గణన ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని, రెండవ దశలో జనాభా గణన ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించ బడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు. ఈ సంవత్సరం జరగనున్న జనాభా గణనను దేశంలో తొలి సారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు అయన తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అంటే ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణం ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు.



మెండోనిరాయి తండాలో రేషన్ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్

## తండాలకు వెలుగులు తెస్తా

**షాద్‌నగర్, మార్చి 16, ప్రభాతవార్త :** ప్రశాంతమైన తండా లలో ఇలాంటి వివాదాలు, ఘర్షణలు లేకుండా నిరాడం బరంగా జీవించే గిరిజనుల కోసం, వారి తండాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం మొండోని రాయి తండా లో రేషన్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ షాప్ లేకుండా ఇక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు గిరిజన నేత సూర్య నాయక్ తన దృష్టికి తేవడం వల్లనే వెంటనే మంజూరు చేశానని వెల్లడిం చారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసు కోవాలని అన్నారు. అదేవిధంగా గిరిజనులు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు షాద్ నగర్ పట్టణంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గిరిజనులకు ఏ కష్టం వచ్చినా ఇక్కడున్న శీను నాయక్, కుమార్, నెహ్రూ, సంజు, రవి లాంటి నాయకులు ఎవరికీ చెప్పిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు జరిగినా, సేవాలాల్ జయంతి లాంటి కార్యక్రమాలు అయినా గిరిజనులతోనే ఆ కార్యక్రమాలకు ప్రత్యేక కళ వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, మాజీ ఎంపీపీ బుజ్జి బాబు నాయక్, మాజీ ఎంపీటీసీ తుపాకుల శేఖర్, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్యాస్ బుకింగ్‌లపై నిరంతర పర్యవేక్షణ

### వదంతులను నమ్మొద్దు..

### అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయి

### కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**రంగారెడ్డి అర్బన్, మార్చి16, ప్రభాతవార్త:** అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థి తుల నేపథ్యంలో జిల్లాలో గృహ అవసరాల కోసం ఎల్పిజి గ్యాస్ కొరత లేదని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. వినియోగదారులు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా సాధారణంగా గ్యాస్ వినియో గించుకోవాలని సూచించారు. సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో గృహ అవ సరాలకు సరిపడా ఎల్పిజి సిలిండర్ల నిల్వలు ఉన్నాయని తెలిపారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్యాస్ సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తున్నామని, ఎక్కడా కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్పిజి సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వినియోగదా రులకు సరైన విధంగా గ్యాస్ సరఫరా జరుగుతున్నదీ, ఎలాంటి అవకతవకలు జరగ కుండా ఉండేలా ప్రత్యేక మానిటరింగ్ కమిటీని నియమించినట్లు వెల్లడించారు. ఈ కమిటీ ద్వారా గ్యాస్ సరఫరా, నిల్వలు, బుకింగ్‌లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతున్నదని తెలిపారు. ప్రజలు అవసరం లేకుండా ముం దస్తుగా ఎక్కువ సంఖ్యలో గ్యాస్ బుకింగ్‌లు చేయవద్దని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వినియోగదారుల అవసరాలకు తగినంత నిల్వలు ఉన్నందున ఎటువంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. గ్యాస్ బుకింగ్‌లు, నిల్వలు, సరఫరా పరిస్థితులపై అధి కారులతో రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎక్కడైనా గ్యాస్ సరఫరాలో సమస్యలు తలెత్తినా, లేదా ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నం చేసినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినియోగదారులు 7989868271 నంబర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చని చెప్పారు.



డిసికి వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:** వంద రోజుల్లో ఆరు గ్యారం టీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ పోచారం డివిజన్ నాయకులు సోమవారం ప్రజాదర్బార్‌లో డిప్యూటీ కమిషనర్ వాణికి వినతి పత్రం అందజేశారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ల పెంపు, మహిళలకు నగదు రూపాయల పంపిణీ, కళ్యాణ లక్ష్మీ పథకంతో తులం బంగారం, చదువుకునే విద్యార్థినిలకు స్కూటీల పంపిణీ, అర్హులకు ఇది రమ్మ ఇళ్ల వంటి పలు పథకాలను అమలు చేస్తామని వాగ్దానం చేసి ప్రజలను మోసగించిందని ఇకనైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ డీసీ వాణి, తహసీల్దార్ చంద్రశేఖర్‌కు బిజెపి నాయకులు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

## దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే సహకారం

**షాద్‌నగర్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మిగిలి ఉన్న నిర్మాణ పనులు పూర్తి చేయడానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.50వేల ఆర్థిక సహకారం అందించారు. గ్రామ ప్రజలు, దేవాలయ కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు ఈ సహాయాన్ని అందజేసినట్లు ఆయన ఆలయ అభివృద్ధి గ్రామ అభివృద్ధికి సంకేతామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, భక్తులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.



## ఘనంగా అమరజీవి జయంతి

**యాచారం, మార్చి 16, ప్రభాతవార్త :** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం యాచారం మండల కేంద్రంలో సాగర్ రహదారి పై ప్రొద్దుటూరు రవీందర్ గుప్త ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద గాంధీ విగ్రహనికి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద్భంగా రవీందర్ గుప్త మాట్లాడుతూ..పొట్టి శ్రీరాములు మహాత్మా గాంధీ ఆలోచనలకు ప్రేరణగా పనిచేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా సమాజంలో సమానత్వం నెలకొల్పాలనే సంకల్పంతో ఆయన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన 58 రోజుల పాటు అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన విషయం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆయన త్యాగం ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు విషంశెట్టి సంతోష్ గుప్త , మాట్లాడుతూ.. మహానుభావుడు, త్యాగశీలి అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం, స్ఫూర్తి యావత్ తెలుగు జాతికి ఆదర్శమని తెలిపారు. 58 రోజుల కఠోర ఉపవాస దీక్ష అనంతరం పొట్టి శ్రీరాములు తుది శ్వాస విడిచారన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలిన మహానీయుడు పొట్టి శ్రీరాములు అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు నాళ్ళ మురళీకృష్ణ, ప్రొద్దుటూరి. సురేందర్ గుప్త, రామాచారి, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ సబ్‌స్టేషన్ తనిఖీ

**దౌల్తాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సీఎండీ తేజస్విపాటిల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ వినియోగం, రికార్డ్‌ల నిర్వహణ పక్కాగా ఉండాలని, పవర్ సేవింగ్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించాలని వారు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

**ఇబ్రహీంపట్నం, మార్చి 16, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన కుమారుడు సాయికీర్తన్ రెడ్డి (20) సోమవారం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ నెల 1న ఎల్బీనగర్ ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదంలో సాయికీర్తన్ తీవ్రంగా గాయపడ్డారు. 15 రోజులుగా మృత్యువుతో పోరాడిన ఆయన, పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు.

# ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడండి

**అంతర్జాతీయ మహిళ దినోత్సవ సదస్సులో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పిలుపు**

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:** ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడే శక్తి మహిళలకే ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిలు అన్నారు. సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బద్దం మమతజగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి మహిళలకు అనేక అవస్థలు ఏర్పడ్డాయని ఈ ప్రభుత్వ హయంలో మహిళలు, రైతులు, యువకులు, ఏ వర్గంకుడా సంతోషంగా లేరని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలు వందరోజుల్లో అమలు చేస్తామని వాగ్దానం చేసి జనాలను నమ్మించి అధికారం చేపట్టిన తర్వాత ఆరు గ్యారంటీలను విస్మరించిందని అన్నారు. గతంలో ఇంటింటికి తాగునీరు సరఫరా అయ్యేదని, నేడు తాగునీటి కొరత అంతటా ఉందని అన్నారు. పింఛన్ రెట్టింపు చేస్తామని, మహిళలకు నగదు పంపిణీ చేస్తామని, యువతులకు స్కూటీలు ఇస్తామని, కళ్యాణ లక్ష్మీ కింద తులం బంగారం ఇస్తామని మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చివాత పెట్టాలని నేతలు మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డితో పాటు కౌశిక్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భద్రారెడ్డి, ప్రీతీ రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, నానావత్ రెడ్యానాయక్, జక్కా వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మంద సంజీవ రెడ్డి, మేకల నర్సింగ్‌రావు, పులికంటి శేఖర్‌రెడ్డి, మంద



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, కౌశిక్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

స్వామిదాస్, దుర్గారాజు గౌడ్, అబ్బవతి నర్సింహ, ఒరుగంటి వెంకటేశ్ గౌడ్, మందాడి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గందరగోళంగా మారిన చీరెల పంపిణీ**

ఊహించినదాని కంటే మహిళలు సమావేశానికి రావడంతో మహిళలకు చీరలు పంపిణీ చేయడానికి నేతలు అవస్థలు పడ్డారు. చీరల పంపిణీలో నేతలు సరియైన పద్ధతి పాటించకపోవడంతో ఒకరిద్దరు కిందపడి ఊపిరాడక తీవ్ర ఆందోళన చెందారు.

## గ్రామాభివృద్ధికి యువత సహకరించాలి : సల్బత్తాపూర్ సర్పంచ్

**బంట్వారం, మార్చి 16, ప్రభాతవార్త :** గ్రామాభివృద్ధికి యువత సహకరించాలని సల్బత్తాపూర్ గ్రామ సర్పంచ్ బాలయ్య అన్నారు. సోమవారం బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామ పరిధిలోని గేట్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను, ముండ్ల పొదలను గ్రామ సర్పంచ్ బాలయ్య గ్రామ యువకులతో కలిసి జెసిబి సహాయంతో చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గేటు నుంచి సల్బతాపూర్ గ్రామానికి డబల్ రోడ్డు ఉండడంతో అధిక వాహనాలు తిరుగుతుంటాయని, అటువైపు వెళుతున్న వాహనాలకు ఏపుగా పెరిగిన ముళ్ళ కంపులు అడ్డుగా ఉండడంవల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వీటిని తొలగించేందుకు గ్రామంలోని యువత స్వచ్ఛంధంగా ముందుగా రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ విషయమై వాహనదారులు గ్రామ సర్పంచ్, యువకులు చేస్తున్న కృషిని అభినంధించారు. ఈ కార్యక్రమంలో చెంగోల్ నర్సింలు, అరవింద్, నరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ళ పొదలను తొలగిస్తున్న గ్రామ సర్పంచ్ బాలయ్య

## ప్రధాన రహదారికి తాత్కాలిక మరమ్మతులు

**ఆమనగల్లు, మార్చి16, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 9వవార్డు శ్రీకాంత్‌కాలనీలో ప్రధాన రహదారిపై ఎదురవుతున్న సమస్యకు కౌన్సిలర్ ఎర్రవోలు మహేశ్ పరిష్కారం చూపారు. ప్రభుత్వ పశువైద్యశాల ఎదురుగా ప్రధాన రహదారిపై పెద్దఎత్తున మట్టి పేరుకుపోయి గోతులు ఏర్పడ్డాయి. సమీప ప్రాంతంలో మున్సిపాలిటీ పైప్‌లైన్ పగిలి నీటి ప్రవాహంతో కుంటలుగా మారిపోయింది. దీంతో ప్రజల రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మహేశ్ మున్సిపాలిటీ సిబ్బంది సహాయంతో చదును చేయించి అనువుగా తీర్చిదిద్దారు. కాగా భారీ వాహనాల రాకపోకలతో ఈప్రాంతంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింటుందని సమీప ప్రజలు ఆరోపిస్తున్నారు. నిరంతరం నీటి నిలువలు ఏర్పడడంతో ప్రజా సమస్య ఉత్పన్నమవుతుందని కౌన్సిలర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సానుకూలం వ్యక్తం చేసి సమస్య రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కాగా ప్రజా సమస్యపై స్పందించిన మహేశ్‌ను కాలనీవాసులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు దాస్యం వంశీ, కర్ణాకర్, రాములు, యాదయ్యనేత, సోహెల్ తదితరులు ఉన్నారు.



చదును పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్ ఎర్రవోలు మహేశ్

## తప్పుడు తీర్మానంతో ప్రహరీ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు

**ధారూర్, మార్చి 16, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని రాంపూర్ తండా గ్రామ పంచాయితీలో పాథమిక పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన తీర్మానం వివాదాస్పదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా దొంగ తీర్మానం చేశారంటూ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎన్. పాండు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో రాంపూర్ తండా పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనుల కేటాయింపు నిమిత్తం గత ఫిబ్రవరి 7వ తేదీన గ్రామ పంచాయితీ కార్యదర్శి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పని చేసేందుకు ఇద్దరు వార్డు సభ్యులు ముందుకొచ్చారు. వీరిలో రుక్యా నాయక్ అనే సభ్యుడికి మెజారిటీ (5గురు) వార్డు సభ్యుల మద్దతు లభించగా, ప్రకాష్ అనే మరో సభ్యుడికి నలుగురు మద్దతు పలికారు. మెజారిటీ ప్రాతిపదికన రుక్యా నాయక్ పేరు మీద పంచాయతీ కార్యదర్శి తీర్మానం ఇచ్చారు. అయితే, వార్డు సభ్యుల పేరిట తీర్మానం ఇవ్వడం సాంకేతికంగా సాధ్యం కాదని పై అధికారులు వెల్లడించడంతో వివాదం మొదలైంది. అధికారులు అభ్యంతరం చెప్పిన తర్వాత, తిరిగి గ్రామ సభ నిర్వహించకుండానే సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి కలిసి పాత తేదీతోనే మరో తప్పుడు తీర్మానాన్ని సృష్టించారని మాజీ సర్పంచ్ ఆరోపిస్తున్నారు. నిబంధనలను విరుద్ధంగా తమకు నచ్చిన వారికి పనులు కట్టబెట్టేందుకే ఈ అక్రమాలకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. పారదర్శకత లేని ఈ తీర్మానంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాల నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

## మూగ జీవాలు వచ్చాయని గిరిజన యువకుడిపై దాడి

**నందిగామ, మార్చి 16, ప్రభాతవార్త:** అన్యం పుణ్యం మెరుగని మూగజీవాలు. మేతకోసం వచ్చిన గేదలను తర్నుతూనే అడ్డు వచ్చిన గిరిజన యువకుడ్ని చితక బాదిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. నందిగామ మండలం సిడి త్నాద గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న తాటిగడ్డ తండా కు చెందిన వినోద్ నాయక్ గేదెలను పోషిస్తూ పశుపోషనపై ఆధారపడి కుటుంబాన్ని నడుపుతున్నాడు. దైనందిన పనుల్లో భాగంగా ఆదివారం తన గేదెలను మేపుతుండగా మా భూముల్లోకి ఎందుకు వచ్చావని, పరుష పదజాలంతో తిడుతూ హనుమయ్య యాదవ్ ఆయన కుమారుడు రమేష్‌లు వినోద్ ను చితకబాదారు. ఇంతటితో ఆగక వినోద్ కు సంబంధించి నా ఆరాధ్య దైవాన్ని తిట్టినట్లు వినోద్ నాయక్ కన్నీరు మునీరయ్యారు. ఈ సంఘటన విషయమై తాను నందిగామ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా గతంలో ఇదే తరహాలో ఆవు తన భూమిలోకి వచ్చిందనే నెపంతో గిరిజన మహిళల అని చూడకుండా అన్నమయ్య యాదవ్ చేయి చేసుకున్నాడనే ఆరోపణలు వినిపించడం కొసమెరుపు. ఈ సంఘటన విషయమై పోలీసులను వివరణ కోరగా హనుమయ్య కొట్టింది వాస్తవమేనని, ఇరు వర్గాల నుండి ఫిర్యాదులు అందాయని ఈ సంఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని చెప్పారు.

## జల వనిత ఆనందకు కలెక్టర్ సన్మానం

**రంగారెడ్డి అర్బన్, మార్చి 16, ప్రభాతవార్త :** జల వనిత ఆనందను జిల్లా కలెక్టర్ అభినందిస్తూ సత్కరించారు. అమనగల్ మండలం చెన్నంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన జల వనిత తెలగమల్ల ఆనంద జల్ జీవన్ మిషన్ అమలులో చేసిన కృషికి గాను జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన జల్ మహోత్సవ్ ప్రచార కార్యక్రమం-2026లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర జల్ శక్తి శాఖ సి.ఆర్.పాటిల్ లు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ కార్యక్రమానికి ముగ్గురు మహిళా సర్పంచులు, ముగ్గురు జల వనితలు మరో ముగ్గురు స్వయం సహాయక సంఘాల మహిళలను ఎంపిక చేయగా, ఎంపికైన వారిలో తెలగమల్ల ఆనంద ఒకరు కావడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగుపరచడంలో ఆమె చేసిన కృషిని కేంద్ర స్థాయిలో గుర్తించడం స్థానికులకు గర్వకారణంగా మారింది.ఇదిలా ఉండగా, జల్ జీవన్ మిషన్ అమలులో ఆమె చూపిన సేవలను గుర్తించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సోమవారం కొంగరకలాన్‌లోని ఐడీఓసీ కార్యాలయంలో తెలగమల్ల ఆనందను ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా కోసం మహిళలు చురుకుగా ముందుకు రావడం అభినందనీయమని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.



ఆనందను అభినందిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

## ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ

**ఘట్‌కేసర్, మార్చి 16, ప్రభాతవార్త:** మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో సోమవారం రంజాన్ తోఫాను పంపిణీ చేసి ఈద్ ముబారక్ తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా వార్డు కార్యాలయ ఆవరణలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు రంజాన్ కానుకలను అందజేశారు. బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, నాయకులతో కలిసి తోఫాలను వితరణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి, సహకార సంఘం మాజీ డైరక్టరు గాయరఉ విశ్వనాథం, కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, కొమురవెల్లి ఉత్సవ సభ్యులు మెరుగు నరేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు గంగి శంకర్, మెట్టు రమేశ్, దొంకెన శంకర్‌గౌడ్, మెడబోయిన జంగయ్య, నాయకులు కవాడి మాధవరెడ్డి, ముద్దం మల్లేశ్ యాదవ్, కవాడి వామన్‌రెడ్డి, కూరం గిరి, కామరాజు కృష్ణ, బాలక్రిష్ణయాదవ్, భాస్కర్‌గౌడ్, షాబీర్, బాబా, మాధర్, ఇంతియాజ్, షానూర్‌బాబా, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



అవుషాపూర్‌లో రంజాన్ తోఫాలు అందజేస్తున్న మహేశ్‌గౌడ్, పావనియాదవ్ తదితరులు

## వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు

**కుల్కచర్ల, మార్చి 16, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రజలకు వైద్య సిబిరాలతో ఎంతో మేలు చేకురుతుందని మండల వైద్య అధికారి కిరణ్ కుమార్ గౌడ్, కుల్కచర్ల సర్పంచ్ ఆంజిలయ్య అన్నారు. సోమవారం మండల మండల కేంద్రంలోని ప్రథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసి వైద్య శిబిన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వైద్య అధికారి కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..తొలి రోజు వైద్యశిబిరం విజయవంతంగా కొనసాగిందన్నారు. 300 మందికి పరీక్షలు నిర్వహించగా 6 మందికి ఎనీమయా ఉనట్లు గురించారు.ఇద్దరు చిన్నపిల్లలకు పెరుగుదల లోపం ఉండడంతో జిజిఎచ్ తాండూర్ ఆసుపత్రికి పంపడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరాని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి భాస్కర్ గౌడ్, సినియర్ నాయకులు మహిపాల్, వైద్యులు మాధిరి, అరుణ, హెల్త్‌అసిస్టెంట్ వెంకటయ్య, సూపర్వైజర్ యాదమ్మ, స్వరుపరాణి, ఏఎన్ఎం ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం బాసటగా ఉంటుంది

**కుల్కచర్ల, మార్చి 16, ప్రభాతవార్త:** ముస్లింల పవిత్ర పండగ రాంజాన్‌ను పురస్కరించుకొని మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాయంలో సోమవారం మండల ముస్లిం కుటుంబాలకు డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు అధికారులతో కలిసి తోఫా కిట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉవాస దీక్షలు ఎంతో భక్తి శ్రద్దలతో పాటిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం కుటుంబాలకు అండగా నిలిస్తుందని అన్నారు.ఈ పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలకుని వృద్దుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయం అని, రాంజాన్ మాసంలో మత సామరస్యానికి ప్రతిక, మత సామరస్య భావం పెంపొంది ప్రజల మధ్య ఐక్యత పెరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టి ప్రధానకార్యదర్శి గోపాల్ నాయక్, మాజి ఎంపిపి ఆంజనేయులు గౌడ్, సినియర్ నాయకులు జాలిల్, శివనందు, షర్ఫధీన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక పాలనపై పోరాటాలకు నడుంబిగించాలి

**కందుకూరు, మార్చి 16, ప్రభాతవార్త :** అక్రమ అరెస్టుల ద్వారా ప్రజల హక్కులను అణచివేయాలని చూడడం పాలకుల అసమర్ధతకు నిదర్శనమని సిపిఎం నాయకులు బుట్ట బాలరాజ్ సిఐటియు నాయకులు బి శ్రీనివాస్ పేర్కొన్నారు. అంగన్వాడి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నంతో ప్రభుత్వం సిపిఎం సిఐటియు అంగన్వాడి వర్కర్లను ముందస్తు అరెస్టులు గృహనిర్బంధాలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం అక్రమ నిర్బంధాలను నిరసిస్తూ వారు మాట్లాడారు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడు అంగన్వాడి కార్మికుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా నిలిచి వివిధ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ఆనాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినాదని నేడు అధికారకంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటి టిఆర్ఎస్ పాలకుల విధానాలనే అవలంబిస్తూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమవుతుందని ఈ విషయాలపై కార్మికులు తమ ఆందోళనను నిరసనలను తెలియజేయాలని చూస్తే పోలీసులను అడ్డు పెట్టి ఉద్యమాలను అణచివేయాలని చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు ప్రజాస్వామ్యంలో ప్రజలకు తమ గోడును వినిపించే హక్కు ఉంటుందని అలాంటి హక్కును అధికార బలంతో అణచివేయాలని చూస్తే అది చాలా రోజులు నడవదని వారు హెచ్చరించారు ఆనాటి పాలకుల కు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఖరిని విలనాడి ప్రజాస్వామ్యబద్ధంగా కార్మికుల న్యాయమైన కోరికలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు కాలంగా సంవత్సరాల కాలంగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రతినెలా 18, వేల రూపాయల జీత బత్యాలు అందించాలని ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలను ఎత్తివేయాలని కుతంత్రాలను ఆపాలని స్మార్ట్ సెంటర్లని పోటీ సెంటర్లను తీసుకువచ్చి కార్మికుల పొట్ట కొట్టాలని చూస్తే సిపిఎం, సిఐటియు చూస్తూ ఊరుకోదని వారు హెచ్చరించారు సర్వేల పేరుతో అనేక రకాల సేవలను కార్మికుల చేత తీసుకొని వారికి పనికి తగ్గ వేతనం అందించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు ప్రజా ప్రభుత్వంగా చెప్పుకునే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేస్తుందని ఇదేనా వారి నినాదమని విమర్శించారు ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి గత ఎన్నికలలో ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

**కేశంపేట, మార్చి 16, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో ఎం జి ఎన్ ఆర్ నిధుల ద్వారా మంజూరైన 10 లక్షల రూపాయలతో తొమ్మిది రేకుల గ్రామంలో సోమవారం సిసి రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత పాలకులు గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసి తమ స్వలాభాల కోసం స్వార్ధ ప్రయోజనాలకు పాల్పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఇప్పటివరకు గ్రామంలో వివిధ నిధుల ద్వారా 70 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో మరిన్ని అభివృద్ధి నిధులు తెచ్చి గ్రామాన్ని అన్ని రంగులలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉద్దవత్ రవి నాయక్, పంచాయతీ కార్యదర్శి అవినాష్ గౌడ్, వార్డు సభ్యులు లచ్చి రామ్ నాయక్, పోగుల నర్సింలు, గుత్తి చంద్రయ్య, లాలమోని మల్లేష్, కావలి వసంత, కందెన సంతోష, నాగిళ్ల ప్రేమలత నాయకులు చిట్టి రెడ్డి నరసింహారెడ్డి, గుత్తి శేఖర్ శంభుల శేఖర్, కానుగుల చెన్నయ్య పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కవితా కరుణాకర్ రెడ్డి తదితరులు

## కోలాహలంగా ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**కొడంగల్, మార్చి 16, ప్రభాతవార్త:** పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహాలోక్ష్మ వేంకటేశ్వర స్వామి 46వ బ్రహ్మోత్సవాలు శ్రీ వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ప్రారంభమైయ్యాయి. సోమవారం మొదటి రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులను వజ్ర వైడూర్యాలు,పూలమాలలతో అలంకరించి తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేవ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్ధప్రసాదాలు అందజేశారు.



శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

## మొండి గౌరెల్లి మత్స్య సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం

**యాచారం మార్చి 16 ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి మత్స్య పారిశ్రామిక సహకార ముదిరాజ్ సంఘం భవనంలో జిల్లా ఎన్నికల అధికారి సామ్సన్ ఆధ్వర్యంలో ఎన్నికలు సోమవారం నిర్వహించారు. 9 మంది సంఘం సభ్యుల సమక్షంలో మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అనంతరం అధ్యక్షులుగా తేరటి భరత్ కుమార్ ముదిరాజ్, కార్యదర్శిగా గుడాల వెంకటేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా కర్నాటి కళ్యాణ్ ముదిరాజ్, కమిటీ సభ్యులుగా తీగల దశరథ, సంగెం రవి,మదం జంగయ్య,మేకల యాదయ్య, గుడాల రాములు, సంగెం శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు గంగనమోని రమేష్, పెద్దమ్మ యాదయ్య, కర్నాటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

## తాండా పేరు మార్చాలని ఎమ్మెల్యేకు విన్నతి

**షాద్‌నగర్, మార్చి 16, ప్రభాతవార్త :** తమ గ్రామం పేరుతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మొండోనిరాయి తాండను లక్ష్మీనగర్ తాండగా మార్చాలని ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్థులు విన్నవించుకున్నారు. గ్రామ సర్పంచి ఆధ్వర్యంలో గ్రామస్థులంతా ఎకగ్రీవ తీర్మాణం చేసుకొని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. అనంతరం సర్పంచి మాట్లాడుతూ... సమస్యలు పరిష్కరించడంలో ముందుండే ఎమ్మెల్యే గ్రామానికి అవసరమైన నిధులు ఇస్తున్నారని ఇలాంటి ఎమ్మెల్యే తమ నియోజకవర్గంలో ఉండటం మా అదృష్టమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బుజ్జిబాబు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మాజీ సర్పంచి రవి, మల్లారెడ్డి, కిషన్‌నగర్ సర్పంచ్ నర్సమ్మ నర్సింహ్మా, చించోడు సర్పంచ్ శ్రీనివాస్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో చోరీ

**ధారూర్, మార్చి 16, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని గడ్డమీది గంగారం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పాఠశాలలోని టాయిలెట్ గదుల తలుపుల తాళాలను పగులగొట్టిన దొంగలు, అందులోని నల్లాలు (ట్యాప్‌లు), ఫ్లాష్‌లను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన సిబ్బంది ఈ విషయాన్ని గమనించి నిర్ఘాంతపోయారు. అయితే గతంలో కూడా పాఠశాలలో రెండు సార్లు దొంగతనం జరిగిందని ప్రధానోపాధ్యాయులు నర్సింహులు తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యాలయాల్లో ఇలాంటి దొంగతనాలు జరగడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

**కుల్కచర్ల, మార్చి 16, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి చెందుతున్నాయని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గోరిగడ్డ తాండ గ్రామపంచాయతిలో సిసి రోడ్డుపనులను స్థానిక సర్పంచ్ అంబికా లాలు నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెనుక పడ్డ గ్రామాలను గత ప్రభుత్వాలు పటించుకున్న పాపాన పోలేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి చెందు తున్నయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ భరత్ కుమార్ రెడ్డి, ప్రధానకార్యదర్శి గోపాల్ నాయక్, మాజి ఎంపిపి ఆంజిలయ్య గౌడ్, ఎస్‌టి సెల్ అధ్యక్షులు రాంచందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## పిట్టలగూడలో పశువైద్య శిబిరం

**నందిగామ, మార్చి 16, ప్రభాతవార్త :** నందిగామ మండలం పిట్టలగూడ గ్రామంలో సోమవారం తెలంగాణ పీవీ నరసింహారావు వెటర్నరీ పశు వైద్య కళాశాల బృందం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లాఇన్చార్జ్ డాక్టర్ శ్రీనివాసరావు హాజరై రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో పశువులకు అన్ని రకాల జబ్బులకు సంబంధించిన మందులు వితరణ చేశారు. ఈ వైద్య శిబిరం మేకగూడ, సంఫీ గూడలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, నందిగామ వెటర్నరీ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, వార్డు సభ్యులు సరిత మురళి, శివగళ్ల సురేష్, శివ గౌడ్, గ్రామస్తులు, రైతులు మాజీ వార్డు సభ్యులుచెన్నయ్య, మాజీ డైరెక్టర్ రవి, కుమార్,నారాయణ, నర్సింలు, రాములు, శేఖర్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## ఆపదలో ఉన్న మిత్రుడికి చేయూత

**యాచారం, మార్చి 16, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన జర్నలిస్ట్ ముచర్ల నాగేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగాయపడి ఇబ్రహీం పట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పదోవ తరగతి మిత్రులు హాస్పిటల్‌లో పరామర్శించి వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేశారు. నెర్రె శ్రీశైలం, పగడాల నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్ల ముందస్తు అరెస్టు

**యాచారం, మార్చి 16, ప్రభాతవార్త:** నాయ్యమైన వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ టీచర్లును సోమవారం యాచారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సంఘం నాయకురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులకు న్యాయ మైన వేతనాలు చెల్లించాలని డిమాండ్ సమస్య పరిష్కరించమని కోరితే అరెస్టు చేయడం దురదృష్టకరమన్నారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళన తప్పని హెచ్చరించారు.

## పిహెచ్‌సీలో ఆరోగ్య శిబిరం

**చేవెళ్ల, మార్చి 16, ప్రభాతవార్త :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ రోజు చేవెళ్ల మండల పరిధి ఆలూర్ గ్రామంలోని పీహెచ్‌సీ లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ బండారు శైలజా ఆగిరెడ్డి, సర్పంచ్ భాగ్యమమ్మ శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## పంచాయతీ సిబ్బందికి పాలకవర్గం సన్మానం

**చేవెళ్ల, మార్చి 16, ప్రభాతవార్త :** చేవెళ్ల మండల పరిధిలోని చెన్వెల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బందిని సోమవారం గుండన్న గారి ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ పట్లన్న గారి దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఎన్. దేవదాస్, సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

## ఏప్రిల్ 4న మందకృష్ణ రాక

**వికారాబాద్, ప్రభాతవార్త:** ఏప్రిల్ 4న దోమ మండలం కిష్టాపూర్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ రానున్నట్లు మహాజన్ సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి.ఆనంద్ మాదిగ తెలిపారు. ఈ విషయమై వికారాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులు కర పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఉప ప్రధాన మంత్రిగా ఎన్నో పదవులను అధిరోహించిన మహనీయులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పార్టీలకతీతంగా యువకులు, మేధావులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోలీస్ వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీ పి.ఆనంద్, సీనియర్ న్యాయవాదులు లవకుమార్, గోవర్ధన్ రెడ్డి, రామచంద్ర రావు, జనార్దన్ రెడ్డి, అశోక్ కుమార్,మహేష్, శుభప్రద్‌పటేల్, మహేష్ రెడ్డి, సిహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**దౌల్తాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** దౌలాంతబాద్ మండలంలోని నాగసార్ గ్రామంలో సోమవారంరోజు సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.ఈ సంధర్భంగా మండల బీజేపీ నాయకులు మాట్లాడుతూ..మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ యొక్క సహకారంతో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద దౌల్తాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు సుమారు 50 లక్షల సీసీ రోడ్డు పనులు రావడం జరిగిందన్నారు.ఇందులో భాగంగానే నాగసార్ గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు.దౌల్తాబాద్ మండలానికి నిధులు ఇచ్చినందుకు ప్రత్యేకంగా పార్లమెంట్ సభ్యురాలు అయినటువంటి డీకే అరుణమ్మకు ఈ సంధర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ దాదాపురం అరుణమ్మ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కూంద్రు నర్సిములు,బీజేపీ మండల మాజీ అధ్యక్షులు సతీష్ ముదిరాజ్,బీజేపీ నాయకులు వెంకటయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూములు సూచిక బోర్డులను తొలగిస్తే చర్యలు తప్పవు

**చేవెళ్ల, మార్చి 16, ప్రభాతవార్త :** శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం భూములకు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను ఆమర్చామని, అమర్చిన సూచిక బోర్డులన తోలగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఇఒ నరేందర్ హెచ్చరించారు. చేవెళ్ల మండలం మల్కాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని 77 ఎరకాలు 30 గుంటల భూమికి సోమవారం జిల్లా దేవాదాయ శాఖ ఉప కమీషనర్ చంద్రేశేఖర్, పరిశీలకులు మోహన్‌రెడ్డి, దేవాలయ దర్మకర్తలు దేవుని వామన చారి, పూజారి అనంతచార్యులు, పూజారి శ్రీపాదు, సిఐ శ్రీధర్ భూపాల్, ఎస్ఐ తేజశ్రీ ఆర్ఐ చంద్రమోహన్‌లతో కలిసి దేవాలయ భూములకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.ఈ సందర్బంగా శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఇఒ నరేందర్ మాట్లాడుతూ దేవాలయ శాఖకు చేందిన భూములను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. భూముల చుట్టు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను తోలగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

## నేడు ఎదులాబాద్‌లో విశ్వశాంతియాగం

**ఘట్‌కేసర్, మార్చి 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి దేవాలయంలో మంగళవారం 16వ విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ యజ్ఞ నిర్వహణకర్త కంట్లం గౌరీశంకర్ తెలిపారు. ప్రతినెల మాసశివరాత్రి రోజున లోకకళ్యాణార్థం విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నామని ఆలయ ఆవరణలోని విష్ణువినాయక కళ్యాణ మండపంలో యజ్ఞ పూజలు జరుగుతాయని తెలిపారు. అర్చకులు శ్యామ్‌కుమార్ మంత్రోచ్చారణాల మధ్య విశ్వశాంతిహోమం జరుగుతుందని పలువురు దంపతులు యాగంలో పాల్గొంటారని అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో వచ్చే మే 12వ తేదీన 21 అడుగుల ఎత్తైన నల్లరాతితో శ్రీవీరహనుమాన్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నామని దాతలు సహకరించాలని ధర్మకర్త కంట్లం గౌరీశంకర్ కోరారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**దోమ, మార్చి 16 ప్రభాతవార్త :** మండల పరిదిలోని అయినాపూర్ గ్రామములో సోమవారం నాడు సమాజ సేవకులు భాస్కర్‌గౌడ్ ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ సందర్బముగ ఆయన మాట్లాడుతూ ఈ సందర్బముగ ముస్లీం సోదరులు ఉపవాస దీక్ష విరమణ సందర్బముగ పండ్లు, బోజన సౌకర్యము ఏర్పాటు చేశారు.పవిత్ర రంజాన్ నెలను ఆద్యాత్మిక సహానం,సరస్పర సహాకారంతో అందరు మెలగాలని కోరారు.అన్ని మతాలను గౌరవించడము నేర్చుకోవాలని ఒకరి మతంను ఇంకోమతం వారు విమర్శించరాదని పేర్కొన్నారు. గ్రామములో ముస్లింలకు ఇఫ్తార్ విందు,హిందువులకు దేవాలయము దగ్గర మంచి శుభకార్యక్రమాలు చేయబోతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమములో వెంకటేశ్‌గౌడ్,ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

## పశుపోషణతో ఆదాయం రెట్టింపు

**అత్తాపూర్ మార్చి 17, ప్రభాతవార్త :** పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, పశువైద్య కళాశాల రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో మేకగూడ గ్రామ దత్తత కార్యక్రమ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనితో పాటుగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి, ఎఐఎన్‌పి, సిఈడిఎ-ఎస్‌సిఎస్‌పి, పశుసంవర్ధక శాఖ, తెలంగాణ ప్రభుత్వం మరియు నాట్కో ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో మేకగూడ, సంఘీగూడ, పిట్టలగూడ గ్రామాలలో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు.

మేకగూడ గ్రామ సర్పంచ్ రాజు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం. కిషన్ కుమార్, గౌరవ అతిథులుగా పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి. మాధురి, రంగారెడ్డి జిల్లా పశువైద్యాధికారి రాజేంద్రనగర్, డా. శ్రీనివాసరావు పాల్గొని రైతులకి మినరల్ మిక్చర్ మరియు పశుగ్రాస మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా.ఎం. కిషన్ కుమార్ మాట్లాడుతూ.. పశుసంవర్ధక రంగం రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని, రైతుల పాల ఉత్పత్తి మంచి స్థాయిలో ఉన్నప్పటికీ సరైన ధర పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా పాలకు విలువ పెంచే ఉత్పత్తులు తయారు చేసి మంచి ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు. డా.ఎం.మాధురి మాట్లాడుతూ శాస్త్రీయ జ్ఞానాన్ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లి రైతులకు అందుబాటులో ఉంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అలాగే మేకగూడ గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడానికి విశ్వవిద్యాలయం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు.

రంగారెడ్డి జిల్లా పశు వైద్యాధికారి డా. శ్రీనివాస రావు మాట్లాడుతూ మేకగూడ గ్రామ ప్రజలు పశుసంవర్ధక రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు కానీ సరియైన పోషణ పద్ధతులు మరియు పశు ఉత్పత్తుల నిర్వహణలో సరియైన అవగాహన లేక ఆశించిన మేరకు లాభాన్ని గడించలేకపోతున్నారు.

# షాద్‌నగర్ విద్యార్థులకు జాతీయ స్థాయి గుర్తింపు

**షాద్‌నగర్, మార్చి 16, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని ఠాగూర్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఖినేషనల్ లెవెల్ ఓపెన్ కుంగ్ ఫు కరాటే ఛాంపియన్‌షిప్‌ఖి పోటీల్లో స్థానిక న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ విన్యాసాలతో అందరినీ ఆకట్టుకొని పలు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికేట్లను కైవసం చేసుకున్నారు. కుంగ్ ఫు మాస్టర్ బాలరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీలకు వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుంగ్ ఫు గ్రాండ్ మాస్టర్ వీరాచారి హాజరై, పోటీలను పర్యవేక్షించడమే కాకుండా విజేతలకు బహుమతులు అందజేశారు. న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రేమ్ కుమార్, రాహుల్ కట్ట, ఫైట్ విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచి ట్రోఫీలను సొంతం చేసుకున్నారు. వీరితో పాటు అకాడమీకి చెందిన మరికొందరు చిన్నారులు కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విద్యార్థుల ప్రతిభపై మాస్టర్ అహ్మద్ ఖాన్ హర్షం వ్యక్తం చేస్తూ, విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



సర్టిఫికెట్లు అందుకున్న కరాటే విద్యార్థులు



## ముస్లిం సంక్షేమానికి ప్రాధాన్యం

**కొడంగల్, మార్చి 16, ప్రభాతవార్త:** ముస్లీం సోదరుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తున్నదని అందులో భాగంగా రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లీం సోదరులకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు.సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరీ చేసిన రంజాన్ కిట్లను మున్సిపల్ పరిధిలోని 12 వార్డుల్లోని ముస్లీం సోదరులకు మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,వైస్ చైర్మేన్ శంకర్‌నాయక్ అందజేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మత సామరస్యం,ఐక్యతకు రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అభివర్ణించారు.రంజాన్ పండుగ సందర్బంగా ఈద్గా మైదానాన్ని అభివృద్ది చేస్తామని అన్నారు.రంజాన్ పండుగను సంతోషంగా అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని అన్నారు.అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యుసుఫ్,కాంగ్రేస్ పట్టణ అధ్యక్షులు కొడంగల్ నయ్యూం, మున్సిపల్ కౌన్సిలర్‌లు రాజశేఖర్, హమీద్, రుమాన్, ఆసీఫ్‌ఖాన్‌లతో పాటు పట్టణ ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

## వంటగ్యాస్ కొరత లేకుండా చూడాలి

**షాబాద్, మార్చి 16, ప్రభాతవార్త :** ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా చేస్తున్న యుద్ధం కారణంగా ఇండియాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే కేంద్ర ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. షాబాద్ మండల కేంద్రంలో సోమవారం సిపిఐ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం ఆధ్వర్యంలో ఇరాన్ పై అమెరికా యుద్దాన్ని వ్యతిరేకిస్తూ పెట్రో వంట గ్యాస్ నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాలమాకుల జంగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, డిహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నక్కలి జంగయ్య, నర్సింలు, మధు, తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి జిల్లా ఉపాధ్యక్షులుగా వెంకటేష్ గుప్తా

**షాద్‌నగర్, మార్చి 16, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన కక్కునూరి వెంకటేష్ గుప్తా ఈ సందర్బంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించి, హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ భాజాపా సీనియర్ నాయకులు, న్యాయవాది, పట్టణ ఆర్యవైశ్య సలహా సంఘం సభ్యులు కక్కునూరి వెంకటేష్ గుప్తా షాద్ నగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి ఆర్యవైశ్య సంఘానికి ఎంతో సేవలు అందించిన వెంకటేష్ గుప్తా కు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పదవి రావడం సంతోషకరమని వారు పేర్కొన్నారు.



వెంకటేష్ గుప్తాను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

## ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

**చేవెళ్ల, మార్చి 16, ప్రభాతవార్త:** ముస్లింలకు అండగా కాంగ్రేస్ ప్రభుత్వం పని చేస్తుందని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అట్లాస్ ఫంక్షన్ హాల్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో చేవెళ్ళ ఏమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని రంజాన్ కిట్లను అంద జేశారు. ఈ సందర్బంగా చేవెళ్ళ ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ హిందు ముస్లింలు సోదర బావంతో మెలుగాలన్నారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని, నిరుపేద ముస్లింలకు ప్రభుత్వం అదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణా, చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, ఇబ్రహింపల్లి కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి, సహకారం సంఘాల మాజీ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి,గోనే ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రామగౌడ్,కాంగ్రేస్ పార్టీ మున్సిపల్ అద్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,నాయకులు ఆగిరెడ్డి, మదుసూదన్‌గుప్తా, యాదిరెడ్డి,బక్కరెడ్డి రవీదర్‌రెడ్డి, రవీందర్, మంగళి యాదగిరి, నరేందర్‌గౌడ్ తదితరుల పాల్గొన్నారు.



రంజాన్ కిట్‌లను అందజేస్తున్న చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య

## సోలార్ రూఫ్ టాప్‌లను అమర్చుకోవాలి

**కొడంగల్, మార్చి 16, ప్రభాతవార్త :** ప్రభుత్వం క్లీన్ ఎనర్జి..గ్రీన్ ఎనర్జిని ప్రోత్సహిస్తున్నదని,అందులో భాగంగా ఇంటిపై ప్రతి ఒక్కరు సోలార్ రూఫ్ టాప్లను అమర్చుకోవాలని టీజీసీపీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్ అన్నారు.సోమవారం కొడంగల్ పటన్టణంలో పర్యటించి సోలార్ రూఫ్ టాప్లను పరిశీలించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఐసోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్నఉ సొంత అవసరాలు తీర్చుకుంటూ మిగిలింది అమ్ముకోవచ్చని తెలిపారు.ఇందుకుగాను ప్రతి ఒక్కరు తమ ఇళ్ళపై సోలార్ రూఫ్ టాప్లను అమర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్‌ను పరిశీలిస్తున్న సిఎండి



డిసి వాణిరెడ్డితో మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ వెంకటేశ్‌గౌడ్

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

**ఘట్‌కేసర్, మార్చి 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ అన్నోజీగూడ డాక్టర్ సూర్యప్రకాష్‌నగర్‌కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు-పోచారం మాజీ కౌన్సిలర్ బాలగౌని వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డీసీ వాణిరెడ్డిని కలిసి డ్రైనేజీ సమస్యను తెలియజేశారు. ఈసందర్భంగా బాలగౌని వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్య, వీధిలైట్లు, సిసి రోడ్ల నిర్మాణం చేయాలని, రాజీవ్‌గృహకల్పకాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంధమల్ల రమేశ్‌కుమార్‌గౌడ్, కాలనీ అధ్యక్షులు కె.సూర్యకాంత్‌రెడ్డి, ఆనంద్‌బాబు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, దిలీప్, ప్రశాంత్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లబ్దిదారులకు అప్పగింత

**శామీర్‌పేట, మార్చి 16, ప్రభాతవార్త:** మురహరిపల్లిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ లబ్దిదారులకు అప్పగించారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మురహరిపల్లిలో గతంలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను లబ్దిదారులకు ఆయన అప్పగించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంతం శిరీషకృష్ణారెడ్డి, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, మేడ్చల్ ఎ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్లు ముద్దం సుదాకర్‌రెడ్డి, గురకాల దీపిసాయికిరణ్, సరసం వనజఅశోక్‌రెడ్డి, నేమూరి స్వప్నరాంప్రసాద్, ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు బి.నవీన్‌రెడ్డి, కె.దినేశ్, బి.బాబు, చి.మల్లేశ్, ఊరడి వెంకటేశ, చంద్రారెడ్డి, సిహెచ్ నర్సింగ్‌రావు, ముద్దం రాఘవరెడ్డి, సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## రూ. కోటితో వివేక్‌నగర్ బస్తీలో సిసి రోడ్డు పనులు

**చిక్కడపల్లి, మార్చి 16, ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి వివేక్‌నగర్ బస్తీలో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ నిధులు రూ. ఒక కోటితో చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, పార్టీ నాయకులు మరియు బస్తీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పనుల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత ఎన్నో ఏళ్లుగా వివేక్‌నగర్ బస్తీ వాసులు దెబ్బతిన్న రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యను గుర్తించి ప్రత్యేక కృషితో ఈ నిధులను మంజూరు చేయించి పనులు ప్రారంభించామన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

**రంగారెడ్డి అర్బన్, మార్చి 16,ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు మంచి వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను అధికారులు జాగ్రత్తగా పరిశీలించి తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 52 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 23, ఇతర శాఖలకు చెందినవి 29 దరఖాస్తులు ఉన్నాయి. అందిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతిలో రైతులకు అధిక లాభాలు

**షాబాద్, మార్చి 16, ప్రభాతవార్త :** రైతులు వ్యవసాయ సాగులో ఆధునిక పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ జి కృష్ణ, భారతీయ మెట్ట పంటల పరిశోధన సంస్థ హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్ లు అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమములో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ మేనేజర్ జయంత్ కుమార్, ఏ.ఈ.ఓలు రాజేశ్వరి, శివతేజ, లిఖిత, మోనిక, ఇఫ్కో కంపెనీ మార్కెట్ డెవెలమెంట్ అధికారి సంజయ్ భార్దజ్, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

## విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**చేవెళ్ల, మార్చి 16, ప్రభాతవార్త :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ గారు మాట్లాడుతు విద్యార్థుల సమస్యలపై ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రాబోయే మార్చి 20న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు.రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం నిరక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల విద్యారంగానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. అందువల్ల వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి హారిక, అనిల్, ప్రశాంత్, లోకేష్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మినీ కవితపై అవగాహన సదస్సు

**ఇబ్రహీంపట్నం, మార్చి 16, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం తెలుగులో మినీ కవిత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నల్లగొండ నాగార్జున ప్రభుత్వ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెల్దండి శ్రీధర్ ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వెల్దండి శ్రీధర్ మాట్లాడుతూ.. మినీ కవితలో సంక్షిప్తత, ధ్వని ప్రధానమని, మూడు నాలుగు వాక్యాల్లోనే పాఠకులను ఆకట్టుకునేలా పదాల పొందిక, కొసమెరుపు ఉండాలని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు కవితలు రాసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ రాధిక మాట్లాడుతూ.. చిన్న చిన్న పదాల్లోనే గొప్ప అర్థాన్ని తెలపడం మినీ కవిత ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. సురేష్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ రాకేష్ భవాని, కృష్ణ, శంకర్, రమేష్, వీరారెడ్డి, నరసింహారావు, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రజావాణికి 125 ఫిర్యాదులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 16, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 125దరఖాస్తులు అందినట్లు, వాటిని వెంటనే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో ఆమెతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులు,ఫిర్యాదులు, వినతిపత్రాలను పరిశీలించి ఎలాంటి జాప్యం లేకుండ వాటిని పరిష్కరించాలని జిల్లా అధికారులకు సూచించారు. తిరస్కరించే వాటికి కారణాలను తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన ధరఖాస్తులపై తీసుకున్న వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆమె సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న మేడ్చల్ జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి

## కేశవరంలో రంజాన్ తోఫా దుస్తుల పంపిణీ

**శామీర్‌పేట, మార్చి 16, ప్రభాతవార్త :** కేశవరంలోని సూపర్‌సంగీత్ పంక్షన్ హాల్‌లో రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన తోఫా దుస్తులను మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్‌లు పాల్గొని ముస్లీం సోదరసోదరీమణులకు పంపిణీ చేశారు. సోమవారం సాయంత్రం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని కేశవరంలో ముస్లీం సోదరసోదరీ మణులకు ప్రభుత్వం అందజేసిన రంజాన్ దుస్తులను కిట్లను పంపిణీ చేసి ఆ తరువాత ప్రార్థనలు, ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మేడ్చల్ ఎ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపాల్టీల కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, తుంకి రమేశ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





## మాన్యం భూములపై విచారణ చేపట్టాలి

**పరిగి మార్చి 16 ప్రభాతవార్త :** సంజీవస్వామి దేవాలయ మాన్యం భూములపై విచారణ చేపట్టాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు దొంగ ఎన్కెపల్లి గ్రామస్థులు కలిసి వినతి పత్రం అందించారు..సోమవారం ప్రజాదర్బార్ లో భాగంగా దోమ మండలంలోని దొంగ ఎన్కెపల్లి గ్రామస్థులు కలిసి సంజీవ స్వామి మాన్యం భూముల విషయంపై కలెక్టర్ దీపక్ తివారీకీ వివరించారు. దేవుడి మాన్యం భూములు అక్రమంగా రెవెన్యూ రికార్డులకు మార్చారని, పరిగి, పూడూరు మండలాల్లోని దేవుడి మాన్యాలను కాపాడాలని కలెక్టర్ కు వివరించారు.. వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారి 104 ఎకరాల మాన్యం భూముల విషయంలో దేవాదాయ శాఖ అధికారులనుండి వివరణ కోరుతామని కలెక్టర్ తెలిపినట్టు గ్రామస్థులు తెలిపారు... పరిగి రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 383 లో గల 9 ఎకరాల 18 గుంటలు, పూడూరు మండలం చెంగోముల్ గ్రామంలో గల సర్వే నంబర్ల 311,312 లలో గల 4 ఎకరాల 26 గుంటల మాన్యం అత్యంత విలువైనదని, భూములను వ్యాపార కార్యక్రమాలకు లీజుకు ఇస్తే, కోటి నుంచి 2 కోట్ల వరకు ఆదాయం వస్తుందని, వీటితో శ్రీ సంజీవ స్వామి దేవాలయం అద్భుతంగా నిర్మాణం చేపట్టవచ్చని గ్రామస్థులు తెలిపారు..మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, కృష్ణయ్య, రాంరెడ్డి, హనుమంతు, కిష్టారెడ్డి, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



## హామీలను నెరవేర్చాలి

**నందిగామ, మార్చి 16, ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కందూరి మనోహర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు గారి పిలుపు మేరకు మండల బీజేపీ అధ్యక్షులు వడ్ల అరవింద్ చారి ఆధ్వర్యంలో నందిగామ మండల తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లే అశోక్ గౌడ్ , జిల్లా గిరిజన మోర్చా నాయకులు మోహన్ సింగ్, మాజీ మండల అధ్యక్షులు సుధాకర్ అప్పా, వడ్ల ప్రభాకర్ చారి, మండల ఉపాధ్యక్షులు కృష్ణమోహన్ గుప్తా, ప్రధాన కార్యదర్శి హేమంత్ నాయక్, మల్లేష్, రాజశేఖర్, ఓబీసీ మోర్చా నాయకులు విక్రాంత్ , బాల్చెట్టి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందుకుంటున్న కే నరసింహులు

### మాజీ సర్పంచ్ నరసింహులుకు

## బహుజన సాహితి అకాడమీ అవార్డు

**షాద్‌నగర్, మార్చి 16, ప్రభాతవార్త :** గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడుపుతూ గ్రామస్తుల కలలను సహకారం చేసిన ఫరూక్ నగర్ మండలం కమ్మదనం గ్రామ మాజీ సర్పంచ్ కె. నరసింహులు దక్కించుకున్నారు. ఈనెల 15వ తేదీన తిరుపతిలో జరిగిన బహుజన సాహితీ అకాడమీ వారి 2025వ సంవత్సర ఉత్తమ సర్పంచ్ గా ఆయన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులను గ్రామస్తుల కు అండగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. బహుజన సాహితీ అకాడమీ పురస్కారానికి తనని ఎంపిక చేసిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ అన్నదాత.. అయ్యాడు కర్షకరత్న.. ఎన్నం నారాయణరెడ్డికి కర్షకరత్న అవార్డు.. నాగలి పట్టి పొలం దున్ని సేద్యం ద్వారా అసాధ్యాలను సుసాధ్యం చేసిన రైతు నారాయణరెడ్డిని కర్షకరత్న పురస్కారం వరించింది. బహుజన సాహితీ అకాడమీ ద్వారా ఆయన ఈ పురస్కారాన్ని పొందారు. ఈనెల 15వ తేదీన తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. దీనిపై స్పందిస్తూ సేద్యం ద్వారా ముందుకు సాగి సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడుతున్న నేపథ్యంలో ఇలాంటి పురస్కారాలు ఎంతో ఆత్మ సంతృప్తిని ఇస్తాయని ఆయన వెల్లడించారు. తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# అంగడిలో అక్రమ పశు రవాణా నిలిపివేయాలి

## -వెటర్నరీ డాక్టర్ అనుమతి తప్పనిసరి చేయాలని కలెక్టర్‌కు వినతి

**హుస్నాబాద్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ప్రతివారం నిర్వహించే అంగడిలో నిబంధనలకువిరుద్ధంగా పశువులను వధశాలలకు తరలిస్తున్నారని, ఈ నేపథ్యంలో అక్రమరవాణాను అరికట్టేందుకు తగినచర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పశువుల అంగడిని టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించడం జరుగుతుందని, ఒకప్పుడు హుస్నాబాద్ మండలంతోపాటు చుట్టుపక్కల మండలాల్లో గణనీయమైన పశుసంపద ఉండేదని, ప్రస్తుతం కొందరు కటిక వ్యాపారస్థులు వెటర్నరీ డాక్టర్ అనుమతి లేకుండానే ఆరోగ్యకరమైన ఆవులు, గేదెలు, దూడలు, లేగలను నిబంధనలకు విరుద్ధంగా పశువధశాలలకు తరలిస్తున్నారని ఆరోపించారు. అంగడినిర్వహించే ప్రతివారం వెటర్నరీ డాక్టర్ల అనుమతితీసుకున్న తర్వాత మాత్రమే పశువులను ఎగుమతి చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కటిక వ్యాపారులు రైతులకంటె అధికధరలు చెల్లించి పశువులను కొనుగోలు చేయడంవల్ల రైతులు పాలు ఇచ్చే గేదెలు, నాగలి నడిపే ఎద్దులను కొనుగోలు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నెల 18వతేదీన హుస్నాబాద్ పశు అంగడి వేలంపాటలో పాల్గొనేవారికి నిబంధనలు కచ్చితంగా అమలుచేయాలని, ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికితీసుకెళ్లి తగినచర్యలుతీసుకోవాలని కోరినట్లు రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

## మల్లన్నస్వామికి బోనాల జాతర


భక్తుల పూజలు అందుకుంటున్న మల్లికార్జున స్వామి దృశ్యం

**అల్లాదుర్గం, మార్చి 16, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కాయితంపల్లి గ్రామశివారులో వెలిసిన శ్రీమల్లికార్జున స్వామి ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. గొల్లకురుమ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జాతరలో భాగంగా సోమవారం స్వామివారికి గ్రామమహిళలు తమ ఇళ్లనుంచి బోనాలతో గ్రామచావిడి వద్దకు చేరుకుని అక్కడినుంచి బైండ్లవారి చప్పుడు, గొల్లకురుముల డోలువాయిద్యాల మధ్య మహిళలు సామూహికంగా బోనాలను ఊరేగిస్తూ ఆలయానికి చేరుకుని స్వామివారికి బోనాలుసమర్పించి పూజాకార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాలనుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## నేడు విద్యార్థులకు ఆటల పోటీలు

**మనూర్, మార్చి 16, ప్రభాతవార్త:**
తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో విద్యను అందుకునేందుకు అడ్మిషన్‌ల కొరకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 17న మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మండలవిద్యాధికారి రాజశేఖర్ శెట్కార్ తెలిపారు. మండలకేంద్రమైన మనూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఉదయం 9గం పాఠశాలకు చేరుకోవాలని రాజశేఖర్ శెట్కార్ వివరించారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### -కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**సిద్ధిపేట అర్బన్, మార్చి 16, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో జరుగుతున్న జాప్యం మూలంగా ఆధ్యాపకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విపి.రాజు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 5నెలలుగా జీతాల చెల్లింపులో ఆలస్యమవడంతో కుటుంబపోషణ, ఇంటి అద్దె, పిల్లల విద్య, వైద్య ఖర్చులు నిర్వహించడంలో ఇబ్బందులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను తెలియజేయడానికి ఆధ్యాపకుల బయోమెట్రిక్ హాజరు నమోదు, పరిపాలనా విధులను తాత్కాలికంగా నిలిపివేసి విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా తరగతిబోధన మాత్రమే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదలచేసి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెలాఖరు వరకు సమస్య పరిష్కారం కాకపోతే ఏప్రిల్ 1నుంచి తరగతులు బహిష్కరించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఆధ్యాపకులు, టీచింగ్, నాన్‌టీచింగ్ అండ్ సబ్‌స్టాఫ్ సిబ్బంది, పిఆర్వో రఘు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా అగ్నిగుండాలు


అగ్నిగుండాలు దాటుతున్న దృశ్యం

**కొమురవెల్లి, మార్చి 16, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామివారి అగ్నిగుండ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం వీరశైవ ఆగమోక్త ప్రకారం 108శివశంకరశివ పుణ్యాహవచనము, అఖండ దీపస్థాపన శివయాగ మంటపస్థాపన, రుత్విద్వరణం, శ్రీస్వామివారి పాదార్చన, శ్రీవీరభద్ర పల్లెరము, రాత్రి 9గంటలకు అగ్నిప్రతిష్ఠ, అగ్నిగుండప్రజ్వలన, అగ్నికార్యం నిర్వహించారు. సోమవారం ఉదయం గణపతి, గౌరీ స్థాపిత మండపారాధన, అనంతరం అష్టబలి, అగ్నిశాంతి, అశేషభక్తజనులమధ్య అగ్నిగుండందాటుట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మహాహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ, మహదాశీర్వచనం, పండిత సన్మానం, అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.కృష్ణప్రసాద్, చైర్మన్ గంగం నర్సింహారెడ్డి, దర్మకర్తలు సార్ల లింగం, ఎ.మల్లేశం, ఎల్లయ్య, కొమురయ్య, వరలక్ష్మి నాగరాజు, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, సహాయ కార్యనిర్వహణాధికారులు బుద్ది శ్రీనివాస్, సుదర్శన్, అర్చకులు, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

## జ్ఞానేశ్వర్‌ను అభినందిస్తున్న డాక్టర్ ఓంప్రకాష్

**నాగల్‌గిద్ద, మార్చి 16, ప్రభాతవార్త:**
మంజీరానదిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని సామాజిక సేవకర్త డాక్టర్ ఓంప్రకాష్ అన్నారు. ఎర్త్ లీడర్ పాలడుగు జ్ఞానేశ్వర్ నది పరిరక్షణకు చేపడుతున్న యాత్ర మంజీరానదీతీరానికి చేరుకోగా, డాక్టర్ ఓంప్రకాష్, జ్ఞానేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ప్రత్యేకంగా అభినందించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నదిలో వేయడంతో నదీజలాలు కలుషితం అవుతాయని, నది కలుషితం కాకుండా ప్రతి ఒక్కరు తమవంతు చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు.

## కళ్యాణలక్ష్మి, గృహలక్ష్మి పథకాలు పూర్తిగా మర్చిపోయారు

**సదాశివపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రజాశక్తి పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దొడ్ల వెంకట్ సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి మెమోరాండం ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవతరాలు కావస్తున్నా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ కాకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్యం వహించడమేనని, రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు చెల్లిస్తానని మాట ఇచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటివరకు ఆపథకాలు అమలుకాకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం తాము ఇస్తామన్న హామీలు వెంటనే నెరవేర్చాలని ఆయన రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అధికారులతో సమీక్షించిన ఎంపిడిఓ


మండలపరిషత్‌లో అధికారులతో సమావేశం అయిన ఎంపిడిఓ

**న్యాల్‌కల్, మార్చి 16, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల ఇంచార్జి అభివృద్ధి అధికారి నరేష్‌బాబు పంచాయతీ అధికారులు, ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఇంచార్జి ఎంపిడిఓ నరేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లోని నర్సరీలు పచ్చగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో గ్రామాల్లోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో 100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ సౌజన్య, ఉపాధిహామీ ఎపిఓ రంగారావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాతృమూర్తిని పరామర్శించిన మాజీ మంత్రి

**పటాన్‌చెరు, మార్చి 16, ప్రభాతవార్త:**
గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాతృమూర్తి గూడెం మాణెమ్మని సోమవారం రాష్ట్ర మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పరామర్శించారు. చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. భగవంతుడి ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. హరీష్‌రావుతోపాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే జిఎంఆర్, కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.

## రంజాన్ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్


రంజాన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్‌చైర్మన్, అధికారులు

**జహీరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:**
పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణశివారులోని ఈద్గాను సోమవారం మున్సిపల్‌చైర్మన్ మహమ్మద్ యూనుస్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, నాయకులతో కలసి పరిశీలించారు. రంజాన్ రోజున వేలాదిమంది మైనార్టీలు సామూహికంగా ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గాకు వస్తారని, అందుకు భక్తులు ఎలాంటి అసౌకర్యంకలగకుండా ఏర్పాట్లు చేయాలని చైర్మన్ యూనుస్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆయావార్డుల కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా సంధ్యారాణి

**హుస్నాబాద్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా న్యాయవాది సంధ్యారాణి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆమెకు పలువురు న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం, సంఘ అభివృద్ధికి కృషిచేయాలని ఆకాంక్షించారు. ఈ పదవిలో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని పలువురు అభినందనలు తెలియజేశారు.

## అత్యవసర సమయంలో మెరుగైన చికిత్స అందించాలి

### -ప్రోగ్రాం మేనేజర్ సంపత్


ఆకస్మికంగా అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం మేనేజర్ సంపత్

**కొండపాక, మార్చి 16, ప్రభాతవార్త:**
అత్యవసర సమయంలో బాధితులకు అందించే ప్రాథమికచికిత్సలో ఎటువంటి తాత్సార్యం లేకుండా మెరుగైన వైద్యచికిత్స అందించాలని 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సంపత్ అన్నారు. సోమవారం కొండపాక 108 అంబులెన్స్‌ను అయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా అంబులెన్స్‌లో ఉన్న పరికరాలు, మందులు బాధితులకు ఎటువంటి సమయంలో ఉపయోగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలుసూచనలు, సలహాలను ఇచ్చారు. జిల్లాలోనే అత్యంత మెరుగైనసేవలందిస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మెడికల్ టెక్నిషియన్ మహేందర్, పైలెట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల ముందస్తు అరెస్ట్



అంగన్‌వాడీ టీచర్లను పోలీసు ఠాణాకు తరలించిన దృశ్యం

**అల్లాదుర్గం, మార్చి 16, ప్రభాతవార్త:**
తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో హైద్రాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లే అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్‌లను, మధ్యాహ్నభోజన వంట కార్మికులను అల్లాదుర్గం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీసు ఠాణాకు తరలించారు. తమను అక్రమంగా అరెస్టుచేయడం తగదని, ఇది ప్రజాస్వామ్యం కాదని అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్‌లు, మధ్యాహ్న భోజన వంటకార్మికులు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా తమసమస్యలను పరిష్కరించుకునేందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటే ఇక తమసమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. తమకు చేసిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని డిమాండ్‌చేశారు.

## ప్రమాదాల నివారణకు దారి మళ్లింపు


ప్రమాదాల నివారణకు వాహనాలను దారి మళ్లిస్తున్న ఎస్ఐ

**ఝరాసంగం, మార్చి 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కెవి పాఠశాల చౌరస్తాలో తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాలను దారిమళ్లిస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపారు. అటుగా వెళ్లే వాహనాలను క్రిష్ణాపూర్, బర్దీపూర్ గ్రామాలగుండా వాహనాల రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నామని, వాహన చోదకులు తమవంతు సహకరించాలని ఎస్ఐ క్రాంతికుమార్ సూచించారు.

## విద్యతోనే బంగారు భవిష్యత్తు

### -ఎస్ఐ వినయ్‌కుమార్


పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఐ వినయ్‌కుమార్

**జహీరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:**
విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని పట్టణ ఎస్ఐ కె.వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారంరాత్రి పట్టణంలోని ఆదర్శనగర్ పార్కులో వాహ్ కిడ్స్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ కె.వినయ్‌కుమార్ మాట్లాడుతూ మొక్కై వంగనిది మ్రానై వంగునా అన్నట్లుగా విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి క్రమశిక్షణతో విద్యను అందుకోవాలని సూచించారు. పోషకులు తమ చిన్నారులను ఉన్నతులుగా ఎదిగేందుకు ఇప్పటినుంచే కృషిచేయాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన ఆటలపోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు ఈసందర్భంగా బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, గుంజోటి సర్పంచి దేశెట్టిపాటిల్, పాఠశాల ప్రిన్సిపాల్ రమ్యసుధారెడ్డి, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి



సిపిఎం నాయకులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**బెజ్జంకి, మార్చి 16, ప్రభాతవార్త:**
అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కార్మికసంఘం హైదారాబాద్‌లో తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమానికి బెజ్జంకి మండలకేంద్రంలో సిపిఎం మండలశాఖ కార్యదర్శి బొమ్మిడి సాయికృష్ణను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రసర్కార్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు రూ.18వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసనకు బయలుదేరుతున్న అంగన్‌వాడీలను, యూనియన్, సిపిఎం పార్టీ నాయకులను అరెస్టుచేయడం సరికాదన్నారు. నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సిద్ధిపేట అర్బన్, మార్చి 16, ప్రభాతవార్త:**
పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని విక్టరీ చౌరస్తాలోగల ఆయనవిగ్రహానికి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షులు కూర శ్రీనివాస్, కార్యదర్శి నాగమల్ల కిషన్, కోశాధికారి బుక్క అరుణ్, గంప కృష్ణ, చింత ప్రసాద్, చకిల రవికుమార్, పోశెట్టి ప్రసాద్, జైన సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారిణి టైగర్ నర్సమ్మ మృతి

### -సంతాపం వ్యక్తంచేసిన హరీష్, పార్టీ శ్రేణులు


టైగర్ నర్సమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

**సిద్ధిపేట రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:**
సిద్దిపేట పట్టణ బిఆర్ఎస్ మహిళావిభాగం అధ్యక్షురాలు ఉద్యమకారిణి టైగర్ నర్సమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. అమెమృతి పట్ల మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సంతాపంవ్యక్తంచేశారు. మొదటి నుంచి కెసిఆర్ వెన్నంటే ఉన్న ఉద్యమకారిణి అని, కెసిఆర్‌కు ఎంతో ఆత్మీయురాలు అని ఆమెమృతి బాధాకరమని హరీష్‌రావు తెలిపారు. ఉద్యమ సమయంలో ఆమె పటిమను గుర్తించి స్వయంగా కెసిఆరే టైగర్ నర్సమ్మగా పేరు ఇచ్చారని గుర్తుచేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కాగా పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, టైగర్ నర్సమ్మ మృతదేహానికి పార్టీ కండువాకప్పి పూలమాలలో నివాళులర్పించారు. అలాగే పార్టీనాయకులు రాజనర్సు, మేర సత్తయ్య, సయిద్, వేలేటి రాధాకృష్ణశర్మ, కోల రమేష్‌గౌడ్‌లు నివాళులర్పించారు.

## హిందూ దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేసిన మైనార్టీ నాయకుడు


మాలపోచమ్మ ఆలయనిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
ఎన్నో సంవత్సరాలుగా ఆలయం లేకుండా ఉన్న గ్రామదేవత మాల పోచమ్మకు ఎట్టకేలకు గుడి నిర్మాణానికి పునాదిపడింది. కులమతాలకు అతీతంగా కాంగ్రెస్‌పార్టీకి చెందిన మైనారిటీ సీనియర్ నాయకుడు మాల పోచమ్మ గుడి నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.40వేల విరాళాన్ని అందజేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. సదాశివపేట మండలం ఎంకేపల్లి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి దుర్గాప్రసాద్ హాజరైనారు. కార్యక్రమంలో మైనార్టీ వార్డు మెంబర్లు అప్సర్ భాష, జాకీర్, సిహెచ్ రామచందర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు అంబరీష్, ప్రకాష్, శ్రీనివాస్, నర్సింలు, జగదీశ్వర్, చంద్రయ్య, మహేందర్, సూర్యప్రకాష్, సువర్ణ, సుమలత, లక్ష్మణ్, బాలమణి, నిర్మల, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ముగిసిన హజ్రత్ సూఫీ షా ఆరాధన


దర్గాకు గంధంను ఊరేగింపుగా తీసుకుపోతున్న దృశ్యం

**చౌటకూరు, మార్చి 16, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులోని హజ్రత్ సూఫీ షా మహమ్మద్ హుస్సేన్ ఉర్స్ ఆబిద్ అలీ షా షత్తారియల్ ఖాద్రీ 13వ ఆరాధన సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు గుస్ల్ షరీఫ్, హల్వా షరీఫ్, ఖవ్వాలి, గంధం షరీఫ్, ఫాతేహా ఖానీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలు ముగిసాక దర్గా పీఠాధిపతి ఆహ్మద్ పాషా గంధం ఊరేగింపు నిర్వహించారు. ఉర్సు ఉత్సవాలకు నిర్మల్, అన్నాసాగర్, రాయిపల్లి పీఠాధిపతులు ముహమ్మద్ జాకిర్ హుస్సేన్, ముహమ్మద్ ఖలీల్ హుస్సేన్, అక్రం అలీలు హాజరై, హజ్రత్ సూఫీ షా దర్గాను దర్శించుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాలనుంచి భక్తులు పెద్దసంఖ్య దర్గాను దర్శించుకున్నారు.

# ఊరూరా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

## -రెవెన్యూ డివిజన్ సాధించి తీరుతాం
## -జెఎసి చైర్మన్ డాక్టర్ పరమేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పరమేశ్వర్

**చేర్యాల, మార్చి 16, ప్రభాతవార్త:**
చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమాన్ని ఊరూరా ఉధృతం చేయడానికి కమిటీలు ప్రకటిస్తున్నామని జెఎసి చైర్మన్ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్ తెలిపారు. సోమవారం జెఎసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కమిటీలను ప్రకటించారు. రాజకీయ వ్యవహారాల సంప్రతింపుల కమిటీ సమన్వయకర్తలుగా అందె బీరయ్య ఫార్వర్డ్ బ్లాక్, అందె అశోక్ సిపిఐ, బస్వగళ్ల సిద్దయ్య, బిఎస్పీ కులసంఘాలు, ప్రజాసంఘాల సమన్వయకర్తలుగా బుట్టి సత్యనారాయణ మాల మహానాడు, గడిపె బాలనర్సయ్య ఎమ్మార్పీఎస్, అంబాల రాము గౌడసంఘం, రిటైర్డ్ ఉపాధ్యాయ ఉద్యోగసంఘాలసమన్వయకర్తలుగా పిల్లి చంద్రం, పోలోజు వెంకటాద్రి, కరెడ్ల రాజిరెడ్డి, ఎక్కలదేవి సుధాకర్, రైతుసంఘాల సమన్వయకర్తలుగా ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్‌రెడ్డి, నంగి కనకయ్య, పిల్లి రవి, విద్యార్థి, యువజనసంఘాల సమన్వయకర్తలుగా రామగళ్ల నరేష్, చందా శ్రీకాంత్ ప్రైవేట్ విద్యాసంస్థల సమన్వయకర్తలుగా తౌట రామాంజనేయులు, ఎండి అక్బర్, దేవేందర్ రెడ్డి మహిళాసంఘాల సమన్వయకర్తలుగా పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, లైట్ మోటార్ యూనియన్ పచ్చిమడ్ల మహేందర్, పాక బాలయ్య, ఆర్ఎంపిల సమన్వయకర్తలుగా నరసింహారెడ్డి, రమేష్ మద్దూరు, కనకయ్య వీరన్నపేట, కనకయ్య కడవేరుగు, క్రైస్తవ అసోసియేషన్ సమన్వయకర్తలుగా తెట్టె బావి డేవిడ్, మోజెస్, ఎర్రగుంట్ల ప్రభాకర్‌లను ఎన్నికచేశారు. అలాగే త్వరలో మండలకమిటీలు ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ జెఎసి నేతలు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, గడిపె బాలనర్సయ్య, పోలోజు వెంకటాద్రి, ఆత్మకూరి హరిక్రిష్ణ తదితరులున్నారు.